క్లుప్తంగా

మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కోరుట్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు కోట దుర్గరాజ్‌తో పాటు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ వర్గానికి చెందిన పొన్నంను మంత్రిగా నియమించినందుకు సీఎంకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు నాయకుల సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

కథలాపూర్: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. మండలంలోని చింతకుంట, భూషణరావుపేట, సిరికొండ, కథలాపూర్, కలిగోట, పోతారం గ్రామాల నాయకులు కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని కోరారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తొట్ల అంజయ్య, గడ్డం స్వామిరెడ్డి, వాకిటి రాజారెడ్డి, కూన శ్రీనివాస్, గడ్డం చిన్నారెడ్డి, కాశవత్రి వంశీ, సాయితేజ, కూన అశోక్ పాల్గొన్నారు.

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆది శ్రీనివాస్‌ను శుక్రవారం భీమారం, మేడిపల్లి మండలాల కాంగ్రెస్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో బీసవేని ముకేశ్, రేండ్ల మధు, చుక్క సతీశ్, సాయిని గంగారెడ్డి, బొమ్మెన ప్రశాంత్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసిన జెడ్పీ వైస్ చైర్మన్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న హరిచరణ్ రావు

మేడిపల్లి: రెండోసారి జగిత్యాల ఎమ్మెల్యేగా ఎన్నికైన సంజయ్‌కుమార్‌ను శుక్రవారం జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఆయన వెంట కొండాపూర్ సర్పంచ్ ధ్యావనపెల్లి అభిలాష్, గుండ్లపల్లి సర్పంచ్ సంపత్‌కుమార్, సాయికుమార్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ సందర్శన



కేజీబీవీలో ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీం

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బిబా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం ప్యానల్ ఇన్‌స్పెక్షన్ టీం సభ్యులు శ్రీమతి, రాజేందర్, శర్మ, రాజ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్ సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో, టీచర్లు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి, యామపూర్, కేశాపూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అబ్బు నర్సుకు రూ. లక్ష, దోనికెన శోభకు రూ.60 వేలు, బొరిగం లక్ష్మికి రూ. 47 వేలు, నిలి లింగంకు రూ.36వేలు, వెంకట్‌కు రూ.51 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జాజాల జగన్‌రావు, సున్నం సత్యం, బొరిగం మహేశ్, పెంట లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోతున్న నిఘా నేత్రాలు

పెగడపల్లి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తరచూ పోలీసు అధికారులు చెబుతుంటారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలంటూ ప్రజలను ప్రోత్సహించారు. నాలుగేళ్ల క్రితం పెగడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నేనుసైతం కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయించారు. అయితే ఏర్పాటు చేసిన రెండేళ్ల వరకు సక్రమంగానే పని చేశాయి. వీటి నిర్వహణపై పోలీసు వ్యవస్థ శ్రద్ధ చూపకపోవడంతో నిర్వహణ లేక ఒక్కొకటిగా మూలకు పడ్డాయి. పెగడపల్లి నంది విగ్రహం, అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మండల కేంద్రంలో దొంగతనాలు, ఘటనలు జరగకుండా.. ఏదైనా ఘటన జరిగినా వెంటనే నిందితులను పట్టుకోవడానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. నిఘా నేత్రాల ఏర్పాటు ద్వారా వాటితో ఉన్న ప్రయోజనాలు, ఆవశ్యకతపై పోలీసులు అవగాహన కల్పించడంతో.. రెండేళ్ల క్రితం ప్రజలు, వ్యాపారుల భాగస్వామ్యంతో మండల కేంద్రంలోని బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, నంది విగ్రహం, పోలీస్ స్టేషన్ వద్ద రూ.లక్షలు ఖర్చు చేసి మొత్తంగా 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇంత ఖర్చు చేసినా సీసీ కెమెరాలు మూన్నాళ్ల ముచ్చటగానే మారాయని ప్రజలు వాపోతున్నారు. ఏదైనా ఘటనలు జరిగితే ఎలా అని మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థ పటిష్టం చేయాల్సిన అవసరముందని ఆయా గ్రామాల ప్రజలు పోలీసులను కోరుతున్నారు. సీసీ కెమెరాలు వినియోగంలోకి తెచ్చేందుకు పోలీసులు చొరవ చూపాల్సిన అవసరముందని అభిప్రాయపడుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులకు సహకరించిన ఔత్సాహికులు.. వాటి నిర్వహణపై శ్రద్ధ చూపాలని పోలీసులను కోరుతున్నారు.



పెగడపల్లిలోని నంది విగ్రహం వద్ద పని చేయని సీసీ కెమెరాలు

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన



వర్షకొండలో మురుగునీటి కాలువపై నిర్మించిన స్లాబ్‌పై కోర్ కటింగ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని 16 గ్రామాల్లో మూడేళ్ల క్రితం నిర్మించిన మురికి కాలువలు, స్లాబ్‌లు, సీసీరోడ్ల నాణ్యతను శుక్రవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. మండలంలోని గ్రామాలలో ఎఫ్‌ఎఫ్‌సీ, ఎస్‌ఎఫ్‌సీ, జీపీ, ఈజీఎస్ నిధుల నుంచి నాణ్యత లేకుండా మురికి కాలువలు, స్లాబ్ కాల్వర్టులు, సీసీరోడ్లు పనులు చేశారని, పని కంటే ఎక్కువగా ఎంబీ రికార్డు చేసి ప్రభుత్వ నిధులను డ్రా చేసుకుని నాణ్యత లేకుండా క్యూసీ నిర్వహించకుండా పనులను పర్యవేక్షించకుండా కమీషన్లు తీసుకుని డీఈ, ఏఈలు పర్సంటేజీలు తీసుకున్నారని మే 22న టీజేఎస్ నాయకుడు కంతి మోహన్ రెడ్డి కరీంనగర్ ఎస్‌ఈకి ఫిర్యాదు చేయగా, శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆయా పనులను పరిశీలించారు. కొని పంచాయతీ రాజ్ డిఈ గోపాల్, ఎఈ నిరంజన్‌రెడ్డిలు అవినీతికి పాల్పడినారని పనులలో నాణ్యతలను పరిశీలించారని కొరుతు మే 22న తెలంగాణ జనసమితి పార్టీ కొరుట్ల నియోజకవర్గం ఇంఛార్జీ కంతి మోహన్‌రెడ్డి పంచాయతి రాజ్ ఎస్‌ఈ కరీంనగర్‌కు ఫిర్యాదు చేశారు. అన్ని పరిశీలించి నాణ్యతా ప్రమాణాలపై రిపోర్ట్ ఇవ్వడానికి 2 నెలల సమయం పడుతుందని డీఈ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రహమన్, డీఈ వేణుగోపాల్, విజులెన్స్ ఏఈలు శేఖర్,శ్రీనివాస్, పీఆర్ ఏఈ నిరంజన్‌రెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మీ పథకం పకడ్బందీగా నిర్వహించాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఎం

మెట్‌పల్లి: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన మహాలక్ష్మి పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డిపో మేనేజర్ వేదవతి సూచించారు. డిపోలో శుక్రవారం డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణానికి సంబంధించిన మార్గదర్శకాలపై వారికి వివరించి అవగాహన కల్పించారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గట్ల రమేశ్, పలువురు సిబ్బంది ఉన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

మల్యాల: మండలంలోని నూకపల్లి సరస్వతీ ఆలయంలో కార్తీక శుక్రవారం పురస్కరించుకుని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పంచామృతాభిషేకం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి, సరస్వతీ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మల్యాల ఎంపీడీవో వెంకటేశం సరస్వతి ఆలయంలో తన మనవడు ఆర్యవర్ధన్‌కు అక్షరాభ్యాసం చేయించారు.

అనాథ ఆశ్రమానికి విరాళం

కథలాపూర్: మండల కేంద్రంలోని మాస్త్రో హైస్కూల్ విద్యార్థులు అనాథ ఆశ్రమానికి రూ.66 వేలు విరాళం శుక్రవారం అందించారు. పాఠశాలలో చదువుతున్న మూడో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు సేకరించిన ఈ డబ్బులను గోదావరిఖనిలోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ అనాథ ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. విద్యార్థుల్లో సామాజిక సేవా స్పృహ పెంపొందించాలని ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మల్యాల: రైతులు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని పోతారం సహకార సంఘం చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు అన్నారు. మండలంలోని పోతారం సహకార భవనంలో శుక్రవారం రైతులు దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాల చెక్కులు అందజేశారు. పోతారం పాక్స్ పరిధిలోని పోతారం, రాజారం, రాంపూర్, గొల్లపల్లె గ్రామాలకు చెందిన 168మంది రైతులు రూ.2.10కోట్ల విలువైన చెక్కులు అందజేశారు. అనంతరం చైర్మన్ సాగర్‌రావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలవైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న చైర్మన్ సాగర్‌రావు

కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలి

మల్లాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఐకేపీ(సెర్ప్) డీపీఎంలు మల్లేశం, భారతి అన్నారు. మండలంలోని గొర్రెపల్లి, వేంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వానాకాలంలో పంట కొనుగోలుకు 126 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. నిర్వాహకులు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. తేమశాతం పరిశీలన, రికార్డుల నిర్వహణను పకడ్బందిగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మీరాజం, సీసీలు రమేష్, రాజు, సీఏలు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎంలు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల: పట్టణ శివారులోని పెద్దగుండు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీల్లో శనివారం ఉదయం గంటలు 10 నుంచి మధ్యాహ్నం గంటలు 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో టౌన్ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోరుట్లరూరల్: పైడిమడుగు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పైడిమడుగు, జోగిన్‌పెల్లి, సర్పరాజ్‌పూర్, మాదాపూర్ గ్రామాల్లో వ్యవసాయ బావులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

మల్యాల: మండలంలో మద్దుట్ల 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మల్యాల, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెల్గటూర్: స్తంభంపల్లి,వెల్గటూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని రాంనగర్, కళానగర్, సుల్తాన్‌పురా, దీన్‌దయాళ్‌నగర్, రబ్బానీపురా, బాలకృష్ణ నగర్, దుబ్బవాడ, రేగుంట, వెంకట్రావ్‌పేట, టీచర్స్ కాలనీ, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు.

12న రాయికల్ మండల సర్వసభ్య సమావేశం

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12న మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పెగడపల్లి: ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శోభ అధ్యక్షతన ఉదయం 11: 30 గంటలకు జరిగే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పాఠశాలకు ఆర్‌వో వాటర్‌ప్లాంట్ వితరణ



ఆర్‌వో ప్లాంట్ అందించిన దాతలు

మేడిపల్లి: మండలంలోని మన్నెగూడెం పాఠశాలకు రూ.13 వేల విలువగల ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం టీచర్స్ హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, హెచ్‌ఎం హరికృష్ణ, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ రజిత, సేవాసంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


టాయిలెట్లు శుభ్రం చేసిన యూత్ సభ్యులు

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్‌లో భాగంగా పట్టణానికి చెందిన గణేశ్ యువజన సంఘం సభ్యులు శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేశారు. ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 30 వ తేదీ వరకు క్లీన్ టాయిలెట్ క్యాంపెయినింగ్ నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా గణేశ్ యువజన సంఘం సభ్యులు 30 మంది టాయిలెట్లు శుభ్రం చేశారు. బహిరంగ మల మూత్ర విసర్జన లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న యువకులు

చిత్ర కథ: ఓ వైపు పనులు.. మరోవైపు పగుళ్లు



మెట్‌పల్లి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్ నుంచి వెలుల్ల రోడ్ వరకు సుమారు రూ.2.50 కోట్లతో ఇటీవల సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. పనులు దాదాపుగా పూర్తయ్యే దశలో ఉన్నాయి. ప్రస్తుతం క్యూరింగ్ నిర్వహిస్తున్నారు. అయితే పనులు మొత్తం పూర్తికాక ముందే అక్కడక్కడ రోడ్డుపై పగుళ్లు ఏర్పడుతున్నాయి. నాలుగు కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్డు అంతలోనే పగుళ్లతో దెబ్బతినడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడు నెలలుగా తెరచుకోని రైతు వేదికలు



పెగడపల్లి రైతు వేదిక భవనం

పెగడపల్లి: రైతులదరినీ ఒకచోట సమావేశపరిచి వారికి వ్యవసాయ సాగులో సలహాలు, సూచనలు అందించేందుకు ఏర్పాటు చేసిన రైతువేదిక భవనాలు మూడు నెలలుగా తెరుచుకోవడం లేదు. మండలంలోని 23 గ్రామాలను ఐదు క్లస్టర్ గ్రామాలుగా విభజించి ఐదు గ్రామాల్లో రూ. 22 లక్షల చొప్పున వెచ్చించి వీటిని నిర్మించారు. అయితే సుమారు మూడు నెలలుగా ఈ భవనాల్లో రైతులకు సంబంధించి అధికారులు ఎలాంటి సమావేశాలు నిర్వహించకపోవడంతో పాటు ఏఈవోలు అటువైపు వెళ్లక పోవడంతో వాటి తాళాలు తెరువక కార్యాలయ సామగ్రి దుమ్ము దూళితో నిండుకుని అస్తవ్యస్తంగా తయారయ్యాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం యాసంగా సాగుకు రైతులు సన్నద్ధంమవుతున్న క్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతువేదిక భవనాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సలహాలు, సూచనలు అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

ఓటర్ జాబితాలో తప్పొప్పులు సవరించాలి

ఇబ్రహీంపట్నం: బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి సర్వే చేసి తప్పులు లేకుండా ఓటర్ జాబితా తయారు చేయాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. రాబోయే సర్పంచ్, లోక్‌సభ ఎన్నికలకు ఓటరు జాబితా తప్పులు లేకుండా ఉండాలని కోరారు. ఓటర్ జాబితాల్లో మృతి చెందిన వారి, గ్రామం నుంచి వెళ్లి పోయిన వారి జాబితా తయారు చేసుకోవాలని అన్నారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రమేశ్, గంగాధర్, మండల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై బీఎల్‌వోలకు శిక్షణ

పెగడపల్లి: రానున్న పార్లమెంట్, గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశం మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు తహసీల్దార్ ఎంఏ ఫరూక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాబితాలో పేరులేని వారు 2024 జనవరి 1నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారు ఓటరు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో లేదా బూత్ లెవల్ అఫీసర్ల వద్ద ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటర్‌గా నమోదు చేయించాలని, అలాగే చేర్పులు, మార్పులతో పాటు మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాయికల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రమాణస్వీకారం చేసిన రోజే ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిపై, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం రాయికల్‌లో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలు ఫైల్‌పై సంతకం చేశారని, ఎమ్మెల్యే గుర్తుచేసుకోవాలని కోరారు. రైతుల గురించి మాట్లాడే నైతికహక్కు సంజయ్‌కుమార్‌కు లేదన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, మాజీ సర్పంచ్ ఎద్దండి భూంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎద్దండి దివాకర్‌రెడ్డి, కొయ్యడి మహిపాల్‌రెడ్డి, గుర్రం మహేందర్, బాపురపు నర్సయ్య, కడకుంట్ల నర్సయ్య, పాల్గొన్నారు.

నిల్వ నీటితో దోమలు వృద్ధి

కోరుట్ల రూరల్: ఇళ్లల్లో ఎక్కువ కాలం నిల్వ ఉంచే నీళ్ల వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని పంచాయతీ అధికారులు అన్నారు. మండలంలోని కల్లూర్‌లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ఇళ్లల్లో నిల్వ నీటిని సిబ్బంది పారబోశారు. నిల్వ నీళ్లల్లో దోమలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రజలకు వివరించారు. పలిగిన కుండలు, పాత టైర్లు, కూలర్లలో ఎక్కువ రోజులు నీళ్ల నిల్వ ఉంచుకోకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వంతడుపుల అంజయ్య, ఎంపీటీసీ చిట్నేని లత, ఉప సర్పంచ్ సంకె రాకేశ్, కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ ప్రమోద్, అంగన్‌వాడీ టీచర్ సంధ్యారాణి, ఏఎన్‌ఎం రజిత, వీవోఏ సంధ్య పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కథలాపూర్: కోరుట్ల- వేములవాడ రోడ్డుపై కథలాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు ప్రత్యేక తనిఖీ చేపట్టారు. బైకులు, ఆటోలు, కార్ల లైసెన్స్‌లు పరిశీలించారు. వాహనాల్లో నిషేధిత వస్తువులు ఏమైనా తరలిస్తున్నారా అని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.